సాక్షి
జనగామ

శనివారం । 20 । మే । 2023



చిలకలగుట్టకు రక్షణ వలయం - 8లో▸
ములుగు జిల్లాలోని సమ్మక్క తల్లి కొలువుదీరిన చిలకలగుట్టకు రక్షణ వలయం ఏర్పాటుకు అధికారులు శ్రీకారం చుట్టారు.



21 నుంచి పలు రైళ్ల రద్దు
కాజీపేట-కొండపల్లి రైలు మార్గంలో ఈనెల 21 నుంచి జూన్ 7వ తేదీ వరకు పలు రైళ్లు రద్దు కానున్నాయి. - 8లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం $40^{0}/28^{0}$
ఉదయం నుంచే ఎండ వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు అధికంగానే ఉంటాయి. వడగాలులు వీస్తాయి. రాత్రి సమయంలో ఉక్కపోత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

నేడు 'రగ్బీ' ఎంపికలు

పాలకుర్తి: చెన్నూరు ప్రభుత్వ పాఠశాలలో శనివారం రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దొంతమల్ల గణేష్ తెలిపారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 16, 17, 18 ఏళ్ల వయస్సు బాలబాలికలు, అలాగే 18 ఏళ్లు పైబడిన వారిని ఎంపిక చేస్తామని, వారు ఈనెల 22 నుంచి హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు 79899 34966, 93812 50852 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బాలబోయిన సందీప్, ఉపాధ్యక్షుడు మొగులగాని నరేష్, కోశాధికారి బెల్లంకొండ సాయిలు పాల్గొన్నారు.

23న జాబ్ మేళా

జనగామ రూరల్: జిల్లాలో ఈనెల 23న నిర్వహించే జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారి ఉమారాణి ఒక ప్రకటనలో తెలిపారు. కనెక్ట్ బిజినెస్ సొల్యూషన్స్ ప్రైవేట్ కంపెనీలో కస్టమర్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు నిర్వహించే జాబ్ మేళాకు జనగామతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నిరుద్యోగ అభ్యర్థులు రావొచ్చని పేర్కొన్నారు. సంబంధిత సర్టిఫికెట్లతో కలెక్టరేట్‌లోని సెకండ్ ఫ్లోర్ 529వ రూం నంబర్‌కు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 79954 30401 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నియామకాలు చేపట్టాలి



జనగామ రూరల్: ఉపాధ్యాయ నియామకాలు తక్షణమే చేపట్టాలని డీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.లింగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా అధ్యక్షుడు ఇప్ప రాంరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. బదిలీలు, పదోన్నతులకు సంబంధించి చట్టపరమైన అడ్డంకులు తొలగించాలని, కేజీబీవీ, గురుకుల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి టి.దివాకర్ రెడ్డి, చొక్కయ్య, యాదయ్య, శ్రీనివాస్‌చారి తదితరులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ షాపులపై కేసు



స్టేషన్‌ఘన్‌పూర్: కాలం చెల్లిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తున్న రెండు ఫర్టిలైజర్ షాపుల యజమానులపై కేసు నమోదు చేసినట్లు సీఐ రాఘవేందర్ తెలిపారు. పక్కా సమాచారం మేరకు స్థానిక బస్టాండ్ సమీపాన ఉన్న తిరుమల ఫర్టిలైజర్స్, మమత ఆగ్రోకెమికల్స్ దుకాణాల్లో మండల ఇన్‌చార్జ్ వ్యవసాయ అధికారి దీప్తి, సిబ్బంది శుక్రవారం తనిఖీలు చేశారు. తిరుమల ఫర్టిలైజర్స్‌లో కాలం చెల్లిన కూరగాయల విత్తనాలు, మమత ఆగ్రో కెమికల్స్ నుంచి కాలం చెల్లిన పురుగుల మందు డబ్బాలు, ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.20వేలు ఉంటుందని, ఏఓ ఫిర్యాదు మేరకు షాపుల యజమానులు మాదారపు ధనుంజయ్, కాసాని మమతపై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

హెడ్ కానిస్టేబుల్ వెంకటయ్యపై వేటు

వరంగల్ క్రైం: అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న హెడ్ కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు వేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. రఘునాథపల్లి పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న బాస్కుల వెంకటయ్య ఫిర్యాదుదారుల నుంచి, అలాగే ఇటీవల సస్పెన్షన్‌కు గురైన సబ్ ఇన్‌స్పెక్టర్ వీరేందర్ చెప్పిన విషయాల్లో డబ్బులు వసూల్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. కొంతమంది ఫిర్యాదుదారులపై అక్రమంగా కేసులు పెట్టడంతో విచారణ చేపట్టి సస్పెండ్ చేసినట్లు తెలిసింది.

భవన నిర్మాణ కార్మికులకు పింఛన్ ఇవ్వాలి

రఘునాథపల్లి: భవన నిర్మాణ కార్మికులు దుర్భర జీవనం గడుపుతున్నారని, వయసు 55 ఏళ్లు నిండిన వారికి రూ.5వేల పింఛన్ ఇవ్వాలని సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి రాసమల్ల కొమురయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం వెల్దిలో భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు ఈఎస్ఐ సదుపాయం, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.15 లక్షల ఎక్స్‌గ్రేషియా, సాధారణ మరణాలకు రూ.5 లక్షలు ఇవ్వాలన్నారు. సిద్దిరాములు, బుచ్చిరెడ్డి, సత్తయ్య, నర్సయ్య, ఎల్లస్వామి, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

హాజరా.. బహిష్కరణా!



తేలని నిధుల కేటాయింపు, ఖర్చుల లెక్కలు

- స్థాయీ సంఘాల సమావేశం నుంచి వైరుధ్యం
- శాఖల వారీ సమీక్ష లేకుండానే తేదీ ఖరారు
- నేడు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం
- హాజరు కావాలని సభ్యులకు చైర్మన్ ఫోన్

జనగామ: జిల్లా పరిషత్ చైర్మన్, జెడ్పీటీసీల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గున మండుతోంది. గ్రామాల అభివృద్ధికి పాలక ప్రభుత్వాలు విడుదల చేసే గ్రాంట్స్(నిధులు) కేటాయింపుల్లో వివక్ష చూపిస్తున్నారని సభ్యులు ఆగ్రహంగా ఉన్నారు. గత నెల జరిగిన స్థాయీ సంఘాల సమావేశం బహిష్కరించేందుకు సిద్ధమవగా.. చర్చించుకుందామన్న చైర్మన్ పిలుపుతో.. దిగివచ్చిన సభ్యులు.. లెక్కల విషయంలో జాప్యం జరిగితే సర్వసభ్య సమావేశం బహిష్కరిస్తామని హెచ్చరించారు. అయితే ఇప్పటి వరకు నిధుల కేటాయింపు, జెడ్పీ ఖర్చులకు సంబంధించి స్పష్టత లేకపోవడంతో.. శనివారం జరిగే సమావేశంపై ఉత్కంఠ నెలకొంది.




జెడ్పీటీసీలు హాజరైతే..!

ఎస్ఎఫ్‌సీ, 15వ ఆర్థిక సంఘం నిధులు, స్పెషల్ గ్రాంట్స్ తదితర నిధుల కేటాయింపుల వ్యవహారం జెడ్పీ చైర్మన్, జెడ్పీటీసీల మధ్య దూరం పెరిగేలా చేసింది. నిధుల కేటాయింపుల్లో చైర్మన్ ఒక్కరే 30 శాతం వాటా తీసుకోవడంతో మెజార్టీ సభ్యులు అవిశ్వాసానికి సిద్ధమంటూ.. స్థాయీ సంఘాల సమావేశం సమయంలో సంకేతాలు పంపించారు. దీంతో సభ్యులను చర్చలకు పిలిచి మాట్లాడిన చైర్మన్.. తర్వాత నిధుల కేటాయింపు విషయంలో ఏమాత్రం మారలేదు. ఈ నేపథ్యంలో జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం తేదీ ఖరారు కావడంతో.. సభ్యులు హాజరవుతారా లేదా అనే ఉత్కంఠ నెలకొంది. దీంతో చైర్మన్ సంపత్‌రెడ్డి స్వయంగా సభ్యులకు ఫోన్ చేసి సమావేశానికి హాజరు కావాలని కోరుతున్నారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు హాజరవుతారని వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. ఒక వేళ సభ్యులు సమావేశానికి వచ్చినా.. ముందు నిధుల వాటాతో పాటు జెడ్పీ ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు కార్యాలయ సాధారణ ఖర్చులకు సంబంధించి ప్రతి పైసా లెక్క చూపించిన తర్వాతే ఎజెండా అంశాలు మొదలు పెట్టాలనే డిమాండ్ చేస్తారని తెలిసింది. లెక్కల విషయంలో ఇంతగా జెడ్పీటీసీలు పట్టుబడుతున్నారంటే.. ఇందులో గోల్‌మాల్ జరిగి ఉండొచ్చని ప్రజలు అనుమానిస్తున్నారు.

తూతూ మంత్రంగానే..

గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి.. భవిష్యత్‌లో చేపట్టే కార్యక్రమాలు, ప్రజాసమస్యలపై చర్చించాల్సిన జెడ్పీ సర్వసభ్య సమావేశాలు తూతూ మంత్రంగా సాగిపోతున్నాయి. వ్యవసాయ, ఉద్యానవన, వైద్యారోగ్య, విద్య, గ్రామీణాభివృద్ధి, పంచాయతీ, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ, తాగునీరు, మహిళా సంక్షేమం, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మత్స్య, ఎక్సైజ్, ఉపాధి, అటవీ తదితర 30 శాఖలకు సంబంధించి ఎజెండా అంశాలపై సర్వసభ్య సమావేశంలో చర్చించాల్సి ఉంటుంది. ఉదయం 11 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశం.. మధ్యాహ్నం 12 తర్వాతనే మొదలు పెట్టడం ఆనవాయితీగా వస్తోంది. ఉన్న కొద్ది సమయంలో నాలుగు శాఖల సమీక్ష కూడా జరగడం లేదు. దీంతో అభివృద్ధి, అవసరమైన పనుల ప్రతిపాదనలు, ఇతరత్రా అంశాలను సభ్యులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లే అవకాశం లేకుండా పోతోంది. పేరుకే సమావేశం పూర్తయినట్లు రికార్డుల్లో రాసుకుంటున్నారని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పైసలు లేవు.. పనులు లేవు



యువజన, క్రీడల శాఖ ఇచ్చిన ఎజెండా

జెడ్పీ సర్వసభ్య సమావేశంలో.. ఆయా శాఖలకు సంబంధించి నిధుల ఖర్చు, పురోగతి తదితర వివరాలను ఎజెండాగా సభ ముందు ఉంచుతారు. ఇందులో 29 శాఖలు తమ నివేదికలను సమర్పించగా, ఒక్క యువజన, క్రీడల శాఖ ఎజెండాను చూసి బిత్తరపోతున్నారు. స్పోర్ట్స్ అథారిటీ, ప్రభుత్వం నుంచి నిధులు కేటాయించనందున ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేక పోతున్నామని జెడ్పీకి ఇచ్చిన 87 పేజీల నివేదికలో ఆ శాఖ అధికారులు పేర్కొనడం గమనార్హం.

రైస్ మిల్లుల్లో పోలీస్ తనిఖీలు

- రికార్డుల పరిశీలన
- ధాన్యం సెంటర్ల సందర్శన

సాక్షి ఎఫెక్ట్



దేవీ రైస్‌మిల్లులో వివరాలు సేకరిస్తున్న డీసీపీ

జనగామ: ప్రభుత్వం సీఎంఆర్ కోసం రైస్ మిల్లర్లకు కేటాయించిన ధాన్యంలో కోతలపై పోలీసులు, ఆయా శాఖల అధికారులు స్పందించారు. 'కొనుగోలుకు కొర్రీలు' శీర్షికన ఈనెల 19న సాక్షిలో ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు ధాన్యం కొనుగోలు సెంటర్లు, రైస్ మిల్లుల బాటపట్టారు. ఏసీపీ దేవేందర్‌రెడ్డి, సీఐ ఎలబోయిన శ్రీనివాస్, సివిల్ సప్లయ్ డీఎం సంధ్యారాణితో కలిసి డీసీపీ పి.సీతారాం పెద్దపహాడ్ ధాన్యం కొనుగోలు కేంద్రం, చంపక్ హిల్స్‌లోని దేవీ రైస్‌మిల్లును శుక్రవారం తనిఖీ చేశారు. ధాన్యంలో కోత పెట్టినట్లు ఆరోపించిన రైతులతోపాటు మిల్లర్లతో మాట్లాడి రికార్డుల ను పరిశీలించారు. ధాన్యం కటింగ్‌కు కారణాలు, అంగీకారం తెలిపిన రైతులు తదితర విషయాలపై శనివారం మరోసారి విచారణ చేపడతామని డీసీపీ తెలిపారు. మిల్లుల్లో అనవసరంగా ధాన్యం కోత పెడితే ఫిర్యాదు చేయాలని సూచించారు. వారి వెంట ఎస్ఐ సృజన్‌తో పాటు పలువురు ఉన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

జనగామ పట్టణంలోని హైదరాబాద్ రోడ్డు జేకేఎస్ అగ్రిమాల్, కావేరీ ఎరువుల దుకాణాలను ఏసీపీ దేవేందర్‌రెడ్డి, సీఐ ఎలబోయిన శ్రీనివాస్, పోలీసు సిబ్బంది ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ విత్తనాలు అమ్మాలని లేదంటే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు.

సబ్సిడీపై జీలుగ విత్తనాలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న డీఏఓ

జనగామ: భూమికి సారం అందించే జీలుగ విత్తనాలను ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తుందని జిల్లా వ్యవసాయధికారి వినోద్‌కుమార్ తెలిపారు. శుక్రవారం పలు వ్యవసాయ క్షేత్రాలను సందర్శించిన ఆయన జీలుగ గురించి వివరించారు. అనంతరం మాట్లాడుతూ తొలకరి వర్షాలు కురిసిన వెంటనే పొలాల్లో ఎకరానికి 12 కిలోల జీలుగ విత్తనాలు వేసి 40 నుంచి 45 రోజుల వయస్సులో భూమిలో కలియదున్నితే భూమి సారం, పోషకాలు, సూక్ష్మజీవులు పెరిగి పంట దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయని పేర్కొన్నారు. అలాగే ఎరువుల వినియోగం తగ్గుతుందని, భూమిలో నీటిని నిలువ చేసుకునే శక్తి కూడా పెంచుకోవచ్చన్నారు. జిల్లాకు 16 క్వింటాళ్ల జీలుగ విత్తనాలను కేటాయించగా మండలాల పరిధి పీఏసీఎస్‌లు, ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాల్లో ఉంచామన్నారు. 30 కిలోల జీలుగ బ్యాగు ధర రూ.2,407.50 ఉండగా, సబ్సిడీ పోను రైతులకు రూ.842.70కి ఇస్తున్నట్లు స్పష్టం చేశారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

జాతీయ చేనేత ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడిగా కృష్ణమూర్తి



రఘునాథపల్లి: జాతీయ చేనేత ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ చింతకింది కృష్ణమూర్తి నియామకమయ్యారు. ఈ మేరకు జాతీయ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున, రాష్ట్ర అధ్యక్షుడు మాడా రాజాలు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా నూతన కమిటీలు వేసి పద్మశాలీలను సంఘటితం చేయడంతోపాటు కులస్తుల సమస్యల పరిష్కారానికి అవిశ్రాంతంగా కృషి చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పద్మశాలీల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

రైతుల గోస పట్టదా..

- బీజేవైఎం నాయకుల ఆగ్రహం
- ఎమ్మెల్యే రాజయ్య రాజీనామా చేయాలని డిమాండ్
- క్యాంపు ఆఫీస్ ముట్టడి.. పలువురి అరెస్ట్



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపైకి చేరి నిరసన తెలుపుతున్న బీజేవైఎం నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించడానికి వచ్చిన రైతులు అష్టకష్టాలు పడుతున్నారు.. కొన్ని చోట్ల ఆత్మహత్యాయత్నాలు చేస్తున్నా ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య, అధికారులు పట్టించుకోవడం లేదని బీజేవైఎస్ నాయకులు మండిపడ్డారు. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించారు. కార్యాలయం భవనం పైకి వెళ్లి బీజేపీ, బీజేవైఎం జెండాలను ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని నాయకులను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి కొలనుపాక శరత్‌కుమార్, అధికార ప్రతినిధి పూండ్రు నవీన్‌రెడ్డి, సోషల్ మీడియా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఇనుగాల కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంట అమ్ముకునే పరిస్థితి లేక అరిగోస పడుతుంటే ఎమ్మెల్యే ఆత్మీయ సమావేశాలంటూ.. డీజే పాటలు, విందులు చిందులతో హంగామా చేయడం సిగ్గుచేటని అన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే స్పందించి కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతుల సమస్యలు పరిష్కరించాలని, లేదంటే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేవైఎం మండల అధ్యక్షుడు నునావత్ రాజ్‌కుమార్ నాయక్, నాయకులు కోరుకొప్పుల నాగేష్‌గౌడ్, రడపాక ప్రదీప్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలే జీవనాధారం

- భూగర్భ జలాలను మరింత పెంచుకుందాం..
- జలశక్తి మంత్రిత్వ శాఖ, నోడల్ అధికారి మాణిక్ రాజ్
- జిల్లాలో కేంద్ర బృందం పర్యటన



కలెక్టరేట్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ తిలకిస్తున్న మాణిక్ రాజ్, అధికారుల బృందం



బచ్చన్నపేటలో ఇంకుడు గుంతను పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

జనగామ/లింగాలఘణపురం/బచ్చన్నపేట: భూగర్భ జలాలు అడుగంటి పోకుండా.. ఇంకుడు గుంతలను వందశాతం సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రెటరీ మాణిక్ రాజ్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని లింగాలఘణపురం మండలం నెల్లుట్ల, బచ్చన్నపేట మండల కేంద్రం, మన్‌సాన్‌పల్లి, పోచన్నపేట గ్రామాల్లో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ బృందం అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి పర్యటించింది. ఈ సందర్భంగా నీటి వనరులతో పాటు పల్లెప్రకృతి వనాలు, నర్సరీలు, సెగ్రిగేషన్‌షెడ్లు, ఇంకుడు గుంతలు, సోక్ ఫిట్స్, చెక్ డ్యాంలు, వాటర్ మేనేజ్‌మెంట్ సిస్టం, ఈజీఎస్, అటవీ శాఖ నాటిన మోడల్ మొక్కలు, క్లీన్ అండ్ గ్రీన్, స్వచ్ఛ భారత్ పనులు, అమృత్ సరోవర్ పథకం అమలు, నీటి ఆధారిత వ్యవసాయం, ఉద్యానవన, డ్రిప్ ఇరిగేషన్ తదితర పనులను పరిశీలించారు. అంతకు ముందు కేంద్ర బృందం కలెక్టరేట్‌కు చేరుకోగా.. అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి కలెక్టర్ శివలింగయ్య స్వాగతం పలికి సత్కరించారు. అనంతరం నీటి వనరుల భద్రత కోసం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. మాణిక్ రాజ్ మాట్లాడుతూ జిల్లాలో నీటి సంబంధిత వనరులను ప్రతి ఒక్కరూ సమృద్ధిగా ఉపయోగించుకోవాలని సూచించారు. భూగర్భ జలాలను పెంచేందుకు అమలు చేస్తున్న పథకాలపై రైతులు, ప్రజలకు సంపూర్ణ అవగాహన ఉండాలని, ఇందుకు కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో వర్షపు నీటిని ఇంకుడు గుంతల్లోకి మళ్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం కలెక్టరేట్‌లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, ఫారెస్ట్, వ్యవసాయ శాఖ, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, ఉద్యానవన శాఖ, ఇరిగేషన్‌కు సంబంధించి జిల్లా పురోగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కేంద్ర బృందానికి వివరించారు. పర్యటనతోపాటు సమీక్షలో డీఆర్డీఓ రాంరెడ్డి, డీఏఓ వినోద్‌కుమార్, ఉద్యానవన శాఖ అధికారిని కేఆర్.లత, ఏపీడీ నూరొద్దీన్, తదితర అధికారులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో 'ప్లాస్టిక్' వేయొద్దు

- జిల్లా పంచాయతీ అధికారి రంగాచారి



బచ్చన్నపేటలో మాట్లాడుతున్న డీపీఓ రంగాచారి

బచ్చన్నపేట: బహిరంగ ప్రదేశాల్లో ప్లాస్టిక్ వస్తువులు వేయొద్దని.. అవి మట్టిలో కలువడానికి వందల ఏళ్లు పడుతుందని జిల్లా పంచాయతీ అధికారి రంగాచారి అన్నారు. శుక్రవారం స్థానిక జీపీ కార్యాలయానికి డీఎల్‌పీఓ పార్థసారథితో కలిసి వచ్చిన ఆయన పరిసరాలను పరిశీలించిన అనంతరం మాట్లాడారు. ప్లాస్టిక్‌ను కాల్చినా.. దాని నుంచి వచ్చే వాసన పీల్చినా అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. అందుకే ప్లాస్టిక్‌ను క్రషింగ్ చేయడానికి ప్రభుత్వం ద్వారా సబ్సిడీపై యంత్రాలు ఇస్తున్నట్లు చెప్పారు. ఆ మిషన్ ద్వారా ప్లాస్టిక్ వస్తువులను చిన్నగా కట్ చేసిన వారికి జీపీ ద్వారా డబ్బులు ఇస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు స్క్రాప్ షాపుదారులను పిలిపించి ప్లాస్టిక్ గురించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వడ్డెపల్లి మల్లారెడ్డి, ఉపసర్పంచ్ కొండ హరికృష్ణ, ఎంపీడీఓ రఘురామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు అనిల్‌రాజ్, చక్రధర్, బిల్ కలెక్టర్ మంజుల, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పగటి వేషాలకు భయపడం

- ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి



సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

తరిగొప్పుల: సీఎం కేసీఆర్ పిరికి మందు నూరిపోయలేదు.. పగటి వేషాలు వేసుకునే వారికి భయపడం అని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పింగిళి జగన్మోహన్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకోవడంతోపాటు సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. ఇటీవల పలు కార్యక్రమాల్లో పాల్గొన్న పార్టీ ఎమ్మెల్సీని ఉద్దేశించి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో కొండెంగలు తిరుగుతున్నాయి.. వాటి మెడలు విరిచే ప్రయత్నం సీఎం కేసీఆర్ చేశారని అన్నారు. జనగామ ఎమ్మెల్యే టికెట్ తనకే ఇస్తున్నట్లు సీఎం హామీ ఇచ్చారని ముత్తిరెడ్డి పేర్కొన్నారు. ఆంధ్రా పాలకులకు అమ్ముడు పోయిన కొమ్మూరి ఏ ముఖం పెట్టుకుని తిరుగుతున్నాడని విమర్శించారు. అనంతరం పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ జొన్నగోని హరితాసుదర్శన్ గౌడ్, సర్పంచ్ ప్రభుదాస్, జెడ్పీటీసీ ముద్దసాని పద్మజావెంకట్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ ఉపేందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ చెన్నూరి ప్రమీలసంజీవ, అధికార ప్రతినిధి చిలువేరు లింగం, మల్యాల సుధీర్, ఎంపీటీసీలు మధుసూదన్‌రెడ్డి, భూక్య జుంలాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఆందోళన చెందవద్దు

- సివిల్ సప్లయ్ జిల్లా అధికారి రోజారాణి



ఏపీఎంతో మాట్లాడుతున్న సివిల్ సప్లయ్ అధికారి

స్టేషన్‌ఘన్‌పూర్: రైతులు ఆందోళన చెందొద్దు.. ప్రతి ధాన్యపు గంజనూ కొనుగోలు చేస్తామని సివిల్ సప్లయ్ జిల్లా అధికారి రోజారాణి అన్నారు. ఘన్‌పూర్ ఐకేపీ కేంద్రంలో ధాన్యం కొనుగోలు ఆలస్యమవుతోందని కామళ్ల వెంకటయ్య అనే రైతు ఆత్మహత్యాయత్నం చేసిన విషయం పత్రికల్లో రావడంతో విచారణ చేపట్టేందుకు ఆమె శుక్రవారం కేంద్రానికి వచ్చారు. అక్కడి పరిస్థితి, సమస్యలపై ఏపీఎం కవిత, ఏఈఓ రేష్మను అడిగి తెలుసుకున్నారు. రైతు వెంకటయ్యకు చెందిన ధాన్యం ఎందుకు కొనుగోలు చేయలేదని విచారించగా నిబంధనల మేరకు లేవని, రంగుమారిన గింజలు ఉండటంతో టోకెన్ ఇవ్వలేదని ఏఈఓ తెలిపారు. మరోసారి తాలు, గడ్డి లేకుండా పట్టాలని చెప్పినట్లు వివరించారు.

సీల్డ్ టెండర్లకు ఆహ్వానం

జనగామ రూరల్: జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థలో స్టేషనరీ, ఆహార పదార్థాలు, కూరగాయలు, పండ్లు, కోడి, గొర్రె మాంసం, ల్యాబ్ మెటీరియల్ అందజేయడం.. క్యాటరింగ్‌కు సీల్డ్ టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్ ఒక ప్రకటనలో తెలిపారు. రూ.1,000 డీడీ తీసి పాలకుర్తి కళాశాలలో ఈనెల 29లోపు దరఖాస్తులు అందజేయాలని, ఎస్సీ, ఎస్టీలకు డిపాజిట్ సొమ్ములో 40శాతం మినహాయింపు ఉంటుందని పేర్కొన్నారు.

రూ.2వేల నోటు రద్దుపై భిన్నాభిప్రాయాలు

రిజర్వ్ బ్యాంకు రూ.2వేల నోటు రద్దు చేస్తున్నట్లు ప్రకటించడంపై.. ప్రజల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రియల్‌ఎస్టేట్, మాఫియా, బ్రోకర్లు, ఎన్నికల సమయంలో వీటి వినియోగం ఎక్కువగా ఉంటుందనీ.. పెద్ద నోటు రద్దుతో మేలు జరిగే అవకాశం ఉందని పలువురు అభిప్రాయ పడుతుండడగా.. పారిశ్రామిక వేత్తలకు లాభం చేకూరేలా ఉందని మరి కొందరు పేర్కొన్నారు. - జనగామ

వ్యాపారులకు ఇబ్బందే..



రూ.2వేల నోటు రద్దుతో వ్యాపారులకు చాలా ఇబ్బంది. లక్షల్లో వ్యాపారం చేసే సమయంలో రూ.500 నోట్ల కట్టలు తీసుకు పోలేం. తీసుకుపోయినా భయమే. పెద్ద నోటు రద్దు చేశారు కాబట్టి రూ.1,000 నోటు అందుబాటులోకి తీసుకువస్తే కొంత ఉపశమనం కలుగుతుంది.

- బుద్దా రమేష్, కిరాణా హోల్‌సేల్ వ్యాపారి, జనగామ

వైట్ మనీ పెరుగుతుంది..



రూ.2వేల నోటు రద్దు శుభపరిణామం. రియల్ ఎస్టేట్, బ్రోకర్లు, మాఫియాకు, బ్లాక్ మార్కెట్ చేసే వారికితో పాటు ఎన్నికల్లో లబ్ధిపొందాలనే రాజకీయ నాయకులకు చెంపదెబ్బ లాంటిది. పెద్ద నోటు రద్దుతో చిన్న నోట్లను పెద్ద మొత్తంలో తీసుకు వెళ్లలేరు. వైట్ మనీ పెరుగుతుంది. కాకపోతే రూ.1000 నోటు అందుబాటులోకి తెస్తే బాగుంటుంది.

- శ్రీరాం శ్రీనివాస్, సీనియర్ అడ్వకేట్, జనగామ

బ్లాక్ మనీ వ్యాపారులకు లాభం



నూటికి 70 శాతం ఆన్‌లైన్ ఆర్థిక లావాదేవీల ప్రక్రియ కొనసాగుతున్న తరుణంలో రూ.2వేల నోటు రద్దు చేయడం బ్లాక్ మనీ వ్యాపారులకు లాభం చేకూరేలా ఉంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సామాన్య ప్రజలు సైతం గూగుల్ పే, ఫోన్ పే, నెట్ బ్యాంకింగ్ వినియోగంతో ఇంట్లో నయాపైసా ఉంచుకోలేని పరిస్థితి ఉంది. రిజర్వ్ బ్యాంకు ప్రస్తుతం తీసుకున్న నిర్ణయం పారిశ్రామిక వేత్తలకు మార్పిడి చేసుకునే అవకాశం ఇచ్చినట్టుగా కనిపిస్తున్నది.

- వనమాల సతీష్, దేవరుప్పుల

ప్రజలను మోసం చేయడమే..



ప్రజల వద్ద ఉన్న రూ.2వేల నోట్లను ఆర్‌బీఐ తిరిగి తీసుకుంటుందని చెప్పడం ముమ్మాటికీ ప్రజలను మోసం చేయడమే. పేద, మధ్యతరగతి ప్రజల వద్ద అసలు ఇవి లేవని చెప్పిన వారు.. ఇప్పుడు ఈ నిర్ణయం తీసుకోవడంలో ఆంతర్యమేమిటో చెప్పాలి. ఉన్నత వర్గాల వద్ద ఉన్న పెద్ద నోట్ల బ్లాక్ మనీని వైట్ చేసుకోవడానికే ఈ నిర్ణయం తీసుకున్నట్టుగా ఉంది.

- పి.చంద్రశేఖర్‌రావు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు

క్లుప్తంగా

21 నుంచి పలు రైళ్ల రద్దు



దోర్నకల్: కాజీపేట– కొండపల్లి రైలు మార్గంలో మూడో లైన్ నిర్మాణ పనులతోపాటు, చింతపల్లి, నెక్కొండ స్టేషన్ల మధ్య పనులు జరగనుండటంతో ఈ నెల 21 నుంచి జూన్ 7వ తేదీ వరకు కాజీపేట –విజయవాడ మార్గంలో పలు రైళ్లు రద్దు కానున్నాయి.

రద్దు కానున్న రైళ్ల వివరాలు:

07753 కాజీపేట– డోర్నకల్
07754 డోర్నకల్– కాజీపేట
07755 విజయవాడ– డోర్నకల్
07756 డోర్నకల్– విజయవాడ
07464 విజవాడ– గుంటూరు
07465 గుంటూరు– విజయవాడ
17660 భద్రాచలంరోడ్– సికింద్రాబాద్
17659 సికింద్రాబాద్– భద్రాచలంరోడ్
12713 విజయవాడ– సికింద్రాబాద్
12714 సికింద్రాబాద్– విజయవాడ
07091 కాజీపేట–తిరుపతి
(మే 23, 30, జూన్ 6న రద్దు)
07092 తిరుపతి– కాజీపేట
(మే 23,30, జూన్6న రద్దు)
07185 మచిలీపట్నం– సికింద్రాబాద్
(మే21, 28, జూన్ 4న రద్దు)
07186 సికింద్రాబాద్– మచిలీపట్నం
(మే21, 28, జూన్ 4న రద్దు)

తాత్కాలికంగా రద్దయ్యే రైళ్లు..

- సిర్పూర్ టౌన్– భద్రాచలం(17034) 20వ తేదీ నుంచి 6వ తేదీ వరకు వరంగల్, భద్రాచలం మధ్య రద్దు
- భద్రాచలం–సిర్పూర్ టౌన్(17033) 21వ తేదీ నుంచి జూన్ 7వ తేదీ వరకు భద్రాచలం, వరంగల్ మధ్య రద్దు
- బెలగావి– మణుగూరు(07335) 20వ తేదీ నుంచి జూన్ 6 వరకు కాజీపేట, మణుగూరు మధ్య రద్దు
- మణుగూడు– బెలగావి(07336) 21వ తేదీ నుంచి జూన్ 7 వరకు మణుగూరు, కాజీపేట మధ్య రద్దు చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు.

ఎండదెబ్బకు ఆగిన గుండె



మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని గాంధీపురం గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ గుండమల్ల వెంకటయ్య (67) శుక్రవారం వడదెబ్బకు గురై మృతిచెందాడు. ఆయన తన వరిచేను వద్దకు వెళ్లి పొలం కోయించి ఇంటికి తిరిగి వచ్చి ఎండ తీవ్రత కారణంగా అస్వస్థతకు గురయ్యారు. ఆ వెంటనే కొంత సమయానికి ఇంటి వద్దే మృతిచెందారు. వెంకటయ్యకు భార్య ఆరుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

కడిపికొండ భూమి టీఎన్జీవోస్‌దే..!

- ఉద్యోగుల సొసైటీ భూమి వదిలే ప్రసక్తేలేదు
- రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు సిద్ధం
- ఉమ్మడి వరంగల్ జిల్లా ఉద్యోగ సంఘాల జేఏసీ నాయకులు



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యోగ సంఘాల ప్రతినిధులు

హన్మకొండ అర్బన్ : ప్రభుత్వ ఉద్యోగుల నివాస స్థలాల కోసం సీఎం కేసీఆర్ కడిపికొండలో కేటాయించిన భూమిలోకి వెళ్లిన ప్రభుత్వ ఉద్యోగుల పై దుర్భాషలాడుతూ భౌతిక దాడులకు పాల్పడిన అసాంఘిక శక్తులను కఠినంగా శిక్షించాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ఉద్యోగ సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఉద్యోగులు విరామ సమయంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట జేఏసీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున నిరసన చేపట్టారు. నిరసనలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ మాట్లాడుతూ.. సీఎం ఉద్యోగుల ఇంటి స్థలాల కోసం కడిపికొండలో కేటాయించిన 32 ఎకరాల స్థలంలో కబ్జాల విషయం గతంలోనే కలెక్టర్, పోలీస్ కమిషనర్, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఉద్యోగులకు కేటాయించిన భూమిని పరిశీలించేందుకు వెళ్లిన ఉద్యోగులపై కొంత మంది దుర్భాషలాడుతూ భౌతిక దాడులకు పాల్పడ్డారని, ఈవిషయాన్ని ఉద్యోగ సంఘాల ఏజేసీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఉద్యోగుల భూమి ఆక్రమణకు పోత్సహిస్తున్న వారు తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందన్నారు. ఈవిషయంలో ఎవరినీ ఉపేక్షించేదిలేదని స్పష్టం చేశారు. దోషులను శిక్షించే వరకు ఉద్యమిస్తామన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రేక్షక పాత్ర వహిస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేసేందుకు సిద్ధమని తెలిపారు. గెజిటెడ్ అధికారుల సంఘం ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ అన్నమనేని జగన్ మోహన్‌రావు మాట్లాడుతూ ఉద్యోగులకు ప్రభుత్వం కేటాయించిన భూమిని ఎట్టి పరిస్థితుల్లో వదులుకునేది లేదన్నారు. సీఎం స్వయంగా ఇచ్చిన ఆదేశాలను బేఖాతర్ చేస్తున్న కొంతమంది అధికారుల వైఖరి వల్ల ఇలాంటి సంఘటనలు పునరావృతం అవుతున్నాయన్నారు. వెంటనే కలెక్టర్, సీపీ ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించి ఉద్యోగుల భూమి అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీఎన్జీఓ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గజ్జెల రామ్‌కిషన్, వేణుగోపాల్, బూరుగు రవి, ములుగు జిల్లా అధ్యక్షుడు జ్ఞానేశ్వర్, నాగరాజు, హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు లక్ష్మణరావు, సభ్యులు వేణుగోపాల్, రమేష్, అశోక్, శ్యాంసుందర్, వెంకట్రామ్‌రెడ్డి, సారంగపాణి, భూక్యా రాము, డాక్టర్ ప్రవీణ్, సురేష్, బింగి సురేష్, రాజేష్‌ఖన్నా, రాజీవ్, అనుప్, భరత్, ప్రణయ్, రాజ్యలక్ష్మి, పావని, శ్రీలత, కల్పన తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

- లైసెన్స్ షాపుల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలి
- వ్యవసాయధికారి విజ్ఞాన్, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్



ఎరువులు, విత్తన షాపులో తనిఖీ చేస్తున్న అధికారులు

ఖిలా వరంగల్: నకిలీ విత్తనాలు విక్రయిస్తే కేసులు నమోదు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయధికారి జి. విజ్ఞాన్, మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్ హెచ్చరించారు. వ్యవసాయాధికారుల సూచనల మేరకు లైసెన్స్ ఉన్న షాపుల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. శుక్రవారం వ్యవసాయ, పోలీస్ శాఖ సంయుక్తంగా వరంగల్ ఫోర్ట్ రోడ్డులో ఎరువులు, విత్తన దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. షాపుల్లో అందుబాటులో ఉన్న పత్తి, మొక్కజొన్న, మిర్చి, ఇతర పంటల విత్తనాల ప్యాకెట్లు, పురుగు మందులను పరిశీలించారు. సుమారు 25 విత్తనాల షాపులను తనిఖీ చేసి రికార్డులు, విత్తనాల విక్రయాల అనుమతులు, కంపెనీ గుర్తింపును అడిగి తెలుసుకున్నారు. పలు షాపుల్లో విత్తన నమూనాలను పరిశీలించారు. నిషేధిత విత్తనాల విక్రయాలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్, ఏఓ విజ్ఞాన్ మాట్లాడుతూ.. నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దని, లైసెన్స్ గల షాపుల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. బ్రోకర్ల మాయమాటలు నమ్మొద్దని, లూజు పత్తి విత్తనాలను విక్రయిస్తున్న వారివద్ద రైతులు విత్తనాలు కొనుగోలు చేసి నష్టపోవద్దని సూచించారు. లైసెన్స్ ఉన్న డీలర్ల వద్ద మేలైన విత్తనాలు కొనుగోలు చేసి బిల్లు తీసుకోవాలని, పంట ముగిసే వరకూ భద్రపర్చుకోవాలని చెప్పారు. పంట దిగుబడులు రానిఝెడల అధికారులకు తెలిపి పరిహారం పొందే అవకాశం ఉందన్నారు. విత్తన బ్రోకర్ల మాటలు నమ్మొద్దని వ్యవసాయాధికారులు సూచించిన డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేసి మంచి దిగుబడులు సాధించాలన్నారు. నిబంధనలు అతిక్రమించి నాణ్యతలేని విత్తనాలు విక్రయిస్తే డీలర్లపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు సుమన్, సాంబయ్య, కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారి చంద్రకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

'నిట్'ల బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న నిట్ వరంగల్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధీ

కాజీపేట అర్బన్: దేశ వ్యాప్తంగా 31 నిట్‌ల బలోపేతానికి కృషి చేసేందుకు నిట్ వరంగల్‌లోని బోస్ సెమినార్ హాల్‌లో శుక్రవారం టు వర్డ్స్ ఎఫెక్టీవ్ మేనేజ్‌మెంట్ ఆఫ్ నిట్స్ అనే అంశంపై జాతీయ స్థాయి వర్క్‌షాప్‌ను ఏర్పాటు చేశారు. నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధీ జాతీయ స్థాయి వర్క్‌షాప్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి, మాట్లాడారు. దేశవ్యాప్త నిట్‌లను ప్రపంచ స్థాయికి తీర్చిదిద్దేందుకు పరస్పర అవగాహనతో ముందుకు సాగాలని అన్నారు. నిట్‌ల బలోపేతానికి దేశవ్యాప్త నిట్‌లను ఏకం చేసేందుకు నిట్ వరంగల్ ముందడుగు వేసిందని తెలిపారు. దేశవ్యాప్తంగా ఇంజనీరింగ్ కళాశాల ప్రారంభోత్సవంలో 1959లో తొలి ఇంజనీరింగ్ కళాశాలగా నాడు ఆర్ఈసీ నేటి నిట్ దేశ వ్యాప్త 31 నిట్‌లకు పెద్దన్నగా నిలుస్తుందని నిట్ రూర్కేలా రిటైర్డ్ డైరెక్టర్, ప్రొఫెసర్ సునీల్‌కుమార్ సారంగి తెలిపారు. న్యూ ఎడ్యుకేషనల్ పాలసీ–2020 అనుగుణంగా విద్యాభోదనకు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో నిట్ రూర్కేలా డైరెక్టర్ ఉమామహేశ్వర్‌రావు, నిట్ వరంగల్ రిజిస్ట్రార్ గోవర్ధన్‌రావు, ప్రొఫెసర్లు వీరాంజనేయులు, దేశవ్యాప్త నిట్‌ల డైరెక్టర్లు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో బదిలీలు..?

- సోమవారం ఉత్తర్వులు వెలువడే అవకాశం

కాజీపేట అర్బన్ : ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సబ్ రిజిస్ట్రార్లతో పాటు జిల్లా రిజిస్ట్రార్ల బదిలీలకు రంగం సిద్ధమైనట్లు విశ్వసనీయ సమాచారం. ఈ మేరకు ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ , రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్లతో కూడిన ఓ కమిటీ బదిలీల ప్రక్రియపై కసరత్తు ప్రారంభించనట్లు తెలిసింది. కాగా, ఉమ్మడి వరంగల్ జిల్లాలకు చెందిన గ్రేడ్–1, గ్రేడ్–2 మూడేండ్లు నిండిన సబ్ రిజిస్ట్రార్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు జిల్లా రిజిస్ట్రార్ హైదరాబాద్‌కు బదిలీ అయ్యే అవకాశం ఉంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో శుక్రవారం బదిలీల సమాచారం చర్చనీయాంశంగా మారింది. దీంతో కొందరు బదిలీలకు బ్రేక్ ఇచ్చేందుకు పావులు కదుపుతున్నట్లు వినికిడి.

గంజాయి విక్రయదారు అరెస్టు



నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

వరంగల్: ఎల్‌బీ నగర్‌లోని జియా మసీదులో ప్రైవేటు ఉద్యోగిగా పనిచేస్తూ.. వరంగల్ బస్టాండ్ సమీపంలో గంజాయి విక్రయిస్తున్న అమన్ హజీజ్ అనే వ్యక్తిని శుక్రవారం అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. గంజాయి అమ్మకాలు, వినియోగం గురించి అందిన విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జితేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఇంతేజార్‌గంజ్ పోలీసులతో కలిసి కమిషనర్ టాస్క్ ఫోర్స్ వరంగల్ బస్టాండ్ సమీపంలో గంజాయి విక్రయాలు, వినియోగంలో పాల్గొంటుండగా హజీజ్‌ను పట్టుకున్నట్లు తెలిపారు. అతని వద్ద నుంచి కిలో 200గ్రాముల ఎండు గంజాయి, మొబైల్ ఫోన్, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. హజీజ్ గత ఏడాది నుంచి గంజాయి విక్రయాలు, సేవించడం అలవాటు చేసుకుని, వరంగల్ రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి నుంచి గంజాయిని కొనుగోలు చేసి చిన్న ప్యాకెట్లలో నింపి విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడైందని తెలిపారు. తదుపరి చర్యల నిమిత్తం ఇంతేజార్‌గంజ్ పోలీసులకు నిందితున్ని అప్పగించినట్లు పేర్కొన్నారు. ఈదాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు కె.శ్రీనివాసరావు, కె.జనార్దన్‌రెడ్డి, ఎస్సైలు లవన్‌కుమార్, నిస్సార్‌పాషా, బి.శరత్, సిబ్బంది పాల్గొన్నారు.

బోల్లోనిపల్లిలో కుల బహిష్కరణ

- భూమి రిజిస్ట్రేషన్ చేయడంలేదని కుల పెద్దల నిర్ణయం
- పాలు పోయకూడదని హుకుం జారీ



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నాయకులు

నల్లబెల్లి: కుల సంఘానికి రాసిచ్చిన భూమి రిజిస్ట్రేషన్ చేయించడంలేదని ఓ కుటుంబాన్ని కుల పెద్దలు బహిష్కరించిన ఘటన వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం బోల్లోనిపల్లిలో శుక్రవారం వెలుగు చూసింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బోల్లోనిపల్లికి చెందిన తిప్పని పెద్దసారయ్య గౌడ్ గ్రామానికి చెందిన గీతకార్మిక సంఘంలో చిట్టీ నిర్వహణ బాధ్యతలు తీసుకున్నాడు. చిట్టీ డబ్బులు తీసుకున్న ఇద్దరు సభ్యులు కొన్నాళ్ల తర్వాత మృతి చెందారు. వీరితోపాటు మరికొందరు సభ్యులు సంఘానికి చెల్లించాల్సిన చిట్టీ డబ్బు ఇవ్వలేదు. దీంతో సంఘం పెద్దలు పెద్ద సారయ్యను బాధ్యుడిగా చేస్తూ నువ్వే చెల్లించాలని 20 ఏళ్ల క్రితం తీర్మానం చేసి ఎకరం భూమిని బలవంతంగా ఆక్రమించుకున్నారు. ఈ భూమిని గౌడ సంఘం పేర రిజిస్ట్రేషన్ చేయాలని కుల పెద్దలు గట్టు సమ్మయ్య, తిప్పని రవీందర్, లింగమూర్తి, మాదాసు ఐలయ్యలతో పాటు పలువురు పెద్ద సారయ్య కుటుంబంపై ఒత్తిడి చేస్తూ మానసికంగా వేధిస్తున్నారు. ఇదిలా ఉండగా పెద్ద సారయ్య కుమారుడు శ్రీనివాస్ తన భూమిని ట్రాక్టర్‌తో దున్నిస్తుండగా విషయం తెలుసుకున్న కుల పెద్దలు అక్కడికి చేరుకొని అడ్డుకుని.. సంఘానికి రాసిచ్చిన భూమిని రిజిస్ట్రేషన్ చేసే వరకు భూమిని దున్నకూడదని బెదిరించారు. అందుకు అంగీకరించకపోవడంతో రిజిస్ట్రేషన్ చేసే వరకు పెద్ద సారయ్య కుటుంబాన్ని కులం నుంచి బహిష్కరిస్తున్నట్లు నిర్ణయించారు. వారితో మాట్లాడితే రూ.5 వేలు జరిమానా చెల్లించాలని, పాలు కూడా పోయకూడదని హుకుం జారీ చేసినట్లు బాధితుడు పెద్ద సారయ్య పేర్కొన్నాడు. ఈ విషయమై ఎస్సై నైనాల నగేష్‌ను సంప్రదించగా తనకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు. విషయం తెలుసుకున్న ప్రజా సంఘాల నాయకులు పరికి కొర్నేల్, బట్టు సాంబయ్య, బొట్ల నరేష్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, వివరాలు తెలుసుకున్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

కాజీపేట రూరల్: కాజీపేట టౌన్ రైల్వేస్టేషన్ సమీపంలోని వడ్డెపల్లి చెరువు కట్ట రైల్వే ట్రాక్ వద్ద శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కాజీపేట జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ దయాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం .. సుమారు 59 ఏళ్ల వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు 5.4 ఎత్తు, చామన ఛాయ, తెలుపు రంగు చొక్కాపై ఎరుపు గీతల లైన్లు, బూడిద రంగు ప్యాంట్, ఎడమ చేతిపై డీఏఆర్ అని పచ్చబొట్టు ఉందని, మృతదేహాన్ని ఎంజీఎం ఆస్పత్రి మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. వివరాలకు కాజీపేట జీఆర్పీ పోలీస్ స్టేషన్ 9493201968లో సంప్రదించాలని సూచించారు.

ఇళ్ల పట్టాలు వచ్చేవరకు పోరాడతాం

- సీపీఎం నేత నాగయ్య



నినాదాలు చేస్తున్న నాగయ్య, నాయకులు

కరీమాబాద్: పేదల ఇళ్లకు పట్టాలు వచ్చే వరకు పోరాడతామని సీపీఎం కేంద్ర కమిటీ నాయకుడు జి.నాగయ్య అన్నారు. ప్రతీ పేదవాడికి కూడు, గూడు కోసం పోరాడేది సీపీఎం పార్టీయేనన్నారు. కరీమాబాద్ సీపీఎం ఏరియా కమిటీ ఆధ్వర్యంలో భట్టుపల్లి రోడ్‌లోని రాజీవ్ గృహకల్ప కాలనీలోని గుడిసెల ప్రాంతాన్ని శుక్రవారం సీపీఎం నాయకులు సందర్శించారు. పార్టీ జెండా ఆవిష్కరణ చేసి కాలనీకి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం నగర్‌గా నామకరణం చేశారు. ఈ సందర్భంగా నాగయ్య మాట్లాడుతూ.. పేదలు వేలాది రూపాయల కిరాయిలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ భూముల్లో పేదలు వేసుకున్న గుడిసెలకు సంబంధించి ఎన్నికల వాగ్దానం ప్రకారం జీఓ 58 ద్వారా పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇళ్లు లేని నిరుపేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పిన పాలకుల మాటలు హామీలకే పరిమితమైందని విమర్శించారు. ఇచ్చిన హామీలను తుంగలోతొక్కి మరోసారి పేదలను మోసం చేయడానికి కుటిల బుద్ధితో పాలకవర్గాలు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. పోరాటాల ద్వారానే హక్కుల సాధన సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి మాట్లాడుతూ.. గుడిసెల పోరాటంలో మహిళలదే కీలకపాత్ర ఉంటుందని చెప్పారు. దేశంలో, రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు, లైంగిక దాడులు జరుగుతున్న నేపథ్యంలో వాటికి వ్యతిరేకంగా మహిళలు ముందుండి పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు రంగయ్య, రత్నమాల, ముక్కెర రామస్వామి, సాగర్, యాదగిరి, బషీర్, అరుణ్‌కుమార్, మధుకర్, మల్లయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్య ఆశయాలతో ముందుకెళ్లాలి

ఖిలా వరంగల్: భారత దేశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలతో సీపీఎం శ్రేణులు, యువత ముందుకెళ్లాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు నాగయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం వరంగల్ శంభునిపేటలో ఓ ఫంక్షన్ హాలులో సీపీఎం రంగశాయిపేట ఏరియా కమిటీ కార్యదర్శి మాలోతు సాగర్ అధ్యక్షతన పుచ్చలపెల్లి సుందరయ్య వర్ధంతిని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై సుందరయ్య చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించి, మాట్లాడారు. కార్మికుల కూలి రెట్ల పెంపు కోసం ఉద్యమాలు చేసిన ఘన ఆయనకే దక్కిందన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన ఆశయాలను మరింత ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి రంగయ్య, ప్రత్యూష, సాంబమూర్తి, గణేపాక ఓదెలు, లక్క రమేష్, రత్నం దాసు ,జ్యోతి, గజ్జ చందు, ఉసిల్ల కుమార్ పాల్గొన్నారు.

చిలకలగుట్టకు రక్షణ వలయం

- ఫెన్సింగ్ ఏర్పాటుకు శ్రీకారం
- పూజలు నిర్వహించిన పూజారులు, అధికారులు



చిలకల గుట్ట (ఫైల్)

ఎస్ఎస్ తాడ్వాయి: ములుగుజిల్లాలోని ఎస్ఎస్ తాడ్వాయి మండలంలో సమ్మక్క తల్లి కొలువుదీరిన చిలకలగుట్టకు రక్షణ వలయం ఏర్పాటుకు అధికారులు శ్రీకారం చుట్టారు. చిలకల గుట్టపై కొలువుదీరిన సమ్మక్క తల్లిని పూజారులు ప్రతీ రెండేళ్లకు ఒకసారి కుంకుమ భరిణి రూపంలో గద్దె పైకి తీసుకొస్తుంటారు. తల్లి కొలువుదీరిన పవిత్ర గుట్టకు రక్షణగా అధికారులు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటుకు తల్లివారం (ఈనెల 18) గురువారం పూజారులు, అధికారులు కలిసి పూజలు నిర్వహించారు. గతంలో కొంతమేరకు ఫెన్సింగ్ ఏర్పాటు చేసి వదిలేశారు. గుట్టకు ఫెన్సింగ్ పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని మంత్రులు, అధికారులను పూజారులు ప్రతి జాతరలో కోరుతున్నారు. ఎట్టకేలకు ఫెన్సింగ్ ఏర్పాటుకు అధికారులు శ్రీకారం చుట్టడంతో పూజారులు, భక్తుల కల నెరవేరనుంది.

రూ.60లక్షల నిధులు..

ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో చిలకలగుట్ట చుట్టూ 425 మీటర్ల పొడువున ఇనుప ఫెన్సింగ్ ఏర్పాటు చేసేందుకు రూ.60 లక్షల నిధులను మంజూరు చేశారు. ఈ నిధులతో గుట్ట చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు పనులు చేపట్టేందుకు సిద్ధమయ్యారు. సమ్మక్క తల్లి కొలువుదీరిన గుట్టపైకి భక్తులు, స్థానిక ప్రజలు ఎక్కడం వల్ల అపవిత్రం అవుతుందని పూజారుల నమ్మకం. గత నాలుగు జాతరల క్రితం గుట్ట చుట్టూ కొంత మేర (600 మీటర్ల) వరకు జాలి ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. మిగిలిన ఫెన్సింగ్ పనులు ఈ సారి పూర్తి చేయనున్నారు. 2024, ఫిబ్రవరిలో జరిగే మహాజాతరకు ముందుగానే ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో చిలుకలగుట్టకు రక్షణ కవచం పనులు మొదలయ్యాయి. దీంతో తల్లి గుట్టకు రక్షణ లభించనుంది.

పవిత్రమైన గుట్టను కాపాడేందుకే..

సమ్మక్క తల్లి స్వయాన కొలువు ఉన్న చిలకలగుట్ట పైకి భక్తులు, ప్రజలు ఎక్కేందుకు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. అంతే కాకుండా గుట్టపై వనమూలికలు కూడా ఉన్నాయని, వాటిని సేకరించేందుకు కొందరు గుట్టను ఎక్కేందుకు ప్రయత్నిస్తుంటారు. మహాజాతర సమయంలో మిగతా రోజుల్లో వచ్చే భక్తులు చిలుకలగుట్ట వద్ద సేదతీరి వంటావార్పు చేసుకుంటే మోక్షం కలుగుతుందని విశ్వాసం. దీంతో భక్తులు ఎక్కువ మంది గుట్ట పరిసరాల్లో విడిది చేస్తుంటారు. భక్తులు, ఇతరులు గుట్ట పరిసరాల్లో వేసిన వ్యర్థాలు, మలమూత్ర విసర్జన చేయడంతో అపరిశుభ్రంగా తయారవుతాయి. ఫెన్సింగ్ ఏర్పాటుతో ఎవరు కూడా గుట్టపైకి వెళ్లేందుకు వీలుండదు. ఫెన్సింగ్ ఏర్పాటుతో సమ్మక్క సారలమ్మ పూజారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



పూజలు చేస్తున్న ట్రైబల్ ఈఈ హేమలత

అధికారులు పర్యవేక్షించాలి..



చిలుకలగుట్ట చుట్టూ పూర్తిస్థాయిలో ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వ పెద్దలు, అధికారులకు విన్నవించగా, ఇప్పటికి కార్యరూపం దాల్చడంతో పూజారుల కల నెరవేరనుంది. మహాజాతర సమయంలో చిలుకలగుట్ట పైకి పూజారులు తప్ప మిగతా ఎవరు కూడా వెళ్లకూడదు. కానీ ఇన్ని రోజులు ఫెన్సింగ్ లేకపోవడంతో మేడారానికి వచ్చే భక్తులు గుట్టపైకి ఎక్కేందుకు ప్రయత్నించడంతో గుట్ట అపవిత్రమవుతుంది. ఫెన్సింగ్ పటిష్టంగా ఉండేలా అధికారులు పనులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి.

– సిద్దబోయిన జగ్గారావు, పూజారుల సంఘం అధ్యక్షుడు